# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




# మీ కష్టాలు చూసి చలించిపోయా



- అందుకే పింఛన్ పెంపు ఏప్రిల్ నుంచే వర్తింపజేశా
- ఆర్థిక సమస్యలున్నా పింఛన్ పెంపుపై నిర్ణయం
- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రథమ కర్తవ్యం
- రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు బహిరంగ లేఖ

స్వయంగా పింఛన్లు అందించనున్న సీఎం చంద్రబాబు

## సుదీర్ఘ నిరీక్షణకు తెర

# పొట్టికప్పు మనదే



- టీ-20 వరల్డ్‌కప్‌లో విశ్వ విజేతగా భారత్
- ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై ఉత్కంఠ విజయం
- రోహిత్ సారథ్యంలో 17 ఏళ్ల తరువాత వరల్డ్ కప్ గెలిచిన ఇండియా
- కీలక మ్యాచ్‌లో రాణించిన స్టార్ బ్యాటర్ కోహ్లీ
- సత్తా చాటిన బౌలర్లు హార్దిక్, బుమ్రా, అర్షదీప్

- పూర్తి కథనం 12లో.

## పొలిటికల్ పెన్‌కౌంటర్





## జగనే మాయ!

# ..ఇంకానా బొంకుడు?

- పూర్తి కథనం 2లో.



## వినతుల వెల్లువ

స్వయంగా స్వీకరించిన సీఎం చంద్రబాబు






# ..ఇంకానా బొంకుడు?

- పోలవరంపై నీలిమీడియాలో రోత రాతలు
- తప్పులు ఎత్తిచూపిన చంద్రబాబుపైకి బురద
- సర్కారు శ్వేతపత్రంపై జనంలో మొదలైన చర్చ
- పాపాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో జగన్
- జగన్మోసపు పత్రికలో అడ్డగోలు అబద్ధాలు
- రాష్ట్ర ప్రజల ముందు దోషిగా నిలబడిన జగన్

## పోలవరం చరిత్రలో వైసీపీది.. ఓ చీకటి పేజీ

అమరావతి (చైతన్య రథం): పచ్చి అబద్ధాలను నిఖార్సైన నిజాలుగా ప్రచారం చేయడంలో మాస్టర్స్ డిగ్రీ చేశామని -వైసీపీ మరోసారి నిరూపించుకుంది. ఐదేళ్ల పాలనను అబద్ధాల దొంతర్లపై సాగించిన జగన్ పార్టీ -పోలవరం పాపంనుంచి, ప్రాజెక్టు ద్రోహంనుంచి తప్పించుకోజూస్తోంది. జగన్ ముఠాలు పోగుచేసిన అబద్ధాలను -విషపు రాతలుగా జనంమీదకు వెదజల్లేందుకు నీలిమీడియా నానాతిప్పలూ పడుతోంది. పోలవరం విధ్వంసానికి పాల్పడిన పచ్చి పాపాన్ని కప్పిపుచ్చుతూ.. జగన్ పాతివ్రత్యాన్ని ప్రపంచానికి చాటేందుకు వేస్తోన్న పిల్లిమొగ్గలను ప్రజలు నమ్మరుగాక నమ్మరు. జాతి జీవనాడి పోలవరం ఆయువుపట్టుమీద జగన్ ఎంత బలంగా కొట్టాడో ఆధారాలు సహా చంద్రబాబు బట్టబయలు చేసిన రోజే -పచ్చి అబద్ధాలను వండివార్చటం.. నీలిమీడియాకే చెల్లింది.

### దోషి.. ద్రోహి.. జగనే!

పోలవరం పనులను ఈనెల 17న క్షేత్రస్థాయిలో పరిశీలించిన సమయంలో -జాతికి జరిగిన ద్రోహాన్ని చూసి చంద్రబాబు కన్ను చెమర్చడాన్ని రాష్ట్ర ప్రజలు మర్చిపోరు. రాష్ట్ర ఆర్థిక, సామాజిక స్వరూపాన్ని సమూలంగా మార్చగల శక్తిపీఠంలాంటి పోలవరం -అసమర్థ పాలకుడి నిర్లక్ష్యానికి ఛిద్రమవడాన్ని చూసి చలించిపోయారు. ప్రజా ప్రభుత్వాధినేతగా పోలవరం నష్టాన్ని ప్రజల ముందుంచాలన్న నైతిక బాధ్యతతో -శుక్రవారం శ్వేతపత్రాన్నీ విడుదల చేశారు. ఎక్కడ నష్టం జరిగింది? ఎంతమేర నష్టం వాటిల్లింది? ఏవిధంగా నష్టం సంభవించింది? ప్రాజెక్టు పాడుపడటానికి కారణాలేంటి? ఎవరు కారకులెవరు? ఇత్యాధి విషయాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆధారాలు సహా విశదీకరించారు. జగను చేసిన జాతిద్రోహం బట్టబయలైతే.. మరింత ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందన్న భయంతో నీలిమీడియా ఎదురుకోలు మొదలెట్టింది. తన తప్పులు కప్పిపుచ్చాలంటే.. ఎదుటివారిపై బురద జల్లాలన్న సహజ దుర్నీతికి దిగింది. పోలవరం వాస్తవాలు ప్రజలకు తెలుసన్న స్పృహకూడా లేకుండా.. పచ్చి అబద్ధాలనే రంగరించింది. నిజాలను రోత రాతల కింద కప్పెట్టే నిస్సిగ్గు ప్రయత్నమే అది. 2014 జూన్ 8నుంచి 2019 మే 29 మధ్య అధికారంలోవున్న చంద్రబాబు, కమీషన్ల దాహంతో చేసిన చారిత్రక తప్పిదాల వల్లే ప్రాజెక్టు విఫలమైందన్న సాక్షి తప్పుడు రాతలు ప్రజలు నమ్మబోరు. దాదాపు మూడొంతుల ప్రాజెక్టు పనులు పూర్తిచేసిన చంద్రబాబు సాహసాన్ని అంగీకరించే ధైర్యం లేక.. తప్పుడు కథనాలకు విత్తులు వేయడం తెంపరితనమే. జగను చేసిన మోసాన్ని అబద్ధపు రాతలకింద దాచాలనుకోవడం వెర్రిమొర్రితనం. చంద్రబాబు ప్రతిష్టపై నీలిమీడియా విషం చిమ్మినంత మాత్రాన -పోలవరం పాపాల నుంచి జగన్‌కు విముక్తి లభిస్తుందనుకోవడం భ్రమ!

### చంద్రబాబు ప్రతిష్టపై వైసీపీ బురద

చంద్రబాబుపై బురద జల్లడానికి నీలిమీడియా మరోసారి జనంపైకి అబద్ధాలను ప్రయోగించింది. పోలవరాన్ని శరవేగంగా పూర్తి చేయడానికి చంద్రబాబు కంకణం కట్టుకోవడంతో -నిర్మాణ బాధ్యతను 2016 సెప్టెంబర్ 7న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది. అప్పటికి ట్రాన్స్‌ట్రాయ్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. కేంద్రం అనుమతితో పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) సమావేశంలో చర్చించి.. ట్రాన్స్‌ట్రాయ్‌తోపాటు నవయుగకు పనులు అప్పగించారు. అలా, తక్కువ సమయంలో దాదాపు 72శాతం పనులు పూర్తిచేసి రికార్డు సృష్టించారు చంద్రబాబు. టీడీపీ ప్రభుత్వ పాలనలో పోలవరంలో అవినీతి జరగలేదని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఢిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేయడం.. ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం. ఈ విషయం తెలిసి కూడా అవినీతి బురదను చంద్రబాబుకు అంటించే కుట్రపూరిత ప్రచారానికి తెరలేపడం సిగ్గుచేటు.

### ప్రాజెక్టుకు ఉరివేసిన మూర్ఖుడు..

కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టునే ఉరికంబమెక్కించిన నీచుడు జగన్. కమీషన్ల కక్కుర్తితో రివర్స్ టెండరింగ్‌ను తెరపైకి తెచ్చి నిర్మాణ ఏజెన్సీని మార్చిన ఫలితమే.. పోలవరానికి పెనుముప్పు వచ్చిపడింది. ఆ విషయం 2019లో జరిగిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం మినిట్సే స్పష్టం చేస్తున్నాయి. జగన్ తన స్వార్థపూరిత ఆలోచన తెరపైకి తెచ్చినపుడు -అప్పటికి పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టరు పనితీరు సంతృప్తికరంగానే ఉందని పీపీఏ కితాబిచ్చింది. ఏజెన్సీని మార్చాల్సిన అవసరం లేదనీ స్పష్టం చేసింది. అకస్మాత్తుగా ఏజెన్సీని మారిస్తే.. 2009లో (వైయస్ సర్కారు) కాంట్రాక్టర్‌ను మార్చడంవల్ల పనులు నిలిచిపోయినట్టే.. ఇప్పుడూ ప్రమాదం తలెత్తవచ్చని హెచ్చరించింది. కాంట్రాక్టర్‌ను మార్చడంవల్ల 10 నెలలకుపైగా (ఒక సీజను) పనుల్లో జాప్యం జరుగుతుందని, నాణ్యతలో ఇబ్బందులొస్తే ఎవరిని బాధ్యులను చేయాలోకూడా అర్థంకాదని పీపీఏ సూచించింది. అయినప్పటికీ -జగన్ మూర్ఖపు నిర్ణయంతో కాంట్రాక్టర్‌ను మార్చి ప్రాజెక్టును గోదాట్లో ముంచేశారు.

### తప్పుడు లెక్కలతో చెత్త రాతలు

ఇక 2005నుంచి 2019 వరకు 24.85 శాతం పనులు జరిగితే.. 2019-24 మధ్య 24.94 శాతం పనులు పూర్తైనట్టు సాక్షి కట్టుకథలు రాయడం.. రాష్ట్రాన్ని మోసం చేయడమే. 2005 నుంచి 2014 వరకు జలయజ్ఞం పేరిట సాగిన పనులు కేవలం 5 శాతంలోపు. అదీ కాల్వల పేరుతో మట్టి పనులు చేసి కమీషన్లు దండుకున్నారన్న విమర్శలు తలెత్తాయి. పునాదిరాళ్లు, శిలాఫలకాల దగ్గరే ఆగిపోయిన పోలవరం.. రాష్ట్ర విభజన తరువాతే పరుగులు పెట్టింది. 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు పాలనలో 72 శాతం పనులు పూర్తయ్యాయి. జగన్ ఐదేళ్ల ఏలుబడిలో కేవలం 3.84 శాతం పనులు మాత్రమే ముందుకెళ్తే.. 24.95 శాతం పనులు పూర్తి చేసినట్టు ప్రకటించుకోవడం ఆత్మవంచన చేసుకోవడమే. 2019-24 మధ్య పోలవరం ప్రాజెక్టు మీద 8,629 కోట్లు వైసీపీ వెచ్చించినట్టు సాక్షి లెక్కలు చూపడం దారుణం. దారిమళ్లించిన నిధులను సైతం ప్రాజెక్టుకు ఖర్చు పెట్టినట్టు నీలిమీడియా రాసిన రాతలు పెద్ద రోత. వాస్తవాలు పరిశీలిస్తే.. మునుపటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేపట్టిన పోలవరం పనుల విలువ రూ.11,762 కోట్లు. అప్పటికి కేంద్రం నుంచి విడుదలైంది రూ.6,764 కోట్లే. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించింది. జగన్ హయాంలో పోలవరానికి వెచ్చించిన వ్యయం రూ.4,167 కోట్లు మాత్రమే. తెదేపా ప్రభుత్వం భరించిన భారాన్ని కేంద్రం రీయింబర్స్ చేస్తే.. అలా వచ్చిన రూ.8వేల కోట్ల నిధుల్లో రూ.3,385 కోట్లు దారి మళ్లించింది వైకాపా సర్కారు. ఆ విషయాన్ని దాచిపెట్టి, నిస్సిగ్గుగా అబద్ధాల రాతలకు తెగబడటం నీలిమీడితా తెంపరితనమే.

### ఇది కదా నిజం..

చంద్రబాబు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టకపోవడంవల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందన్న పచ్చి అబద్ధాన్ని రాసుకొచ్చింది నీలిమీడియా. నిజానికి -అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు ప్రమాణ స్వీకారం చేసిన రోజే పనులు నిలిపేసింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకుండానే ఏజెన్సీలను తొలగించారు జగన్. అలా, 2020 నవంబరు వరకు పనులు చేపట్టలేదు. కాఫర్ డ్యాంలలో గ్యాప్‌లు పూర్తి చేయలేదు. అప్పటికే సమర్థులైన, అనుభవమున్న అధికారులను బదిలీ చేశారు. అలాంటి పరిస్థితుల్లో 2020 ఆగష్టులో భారీ వరదలు సంభవించి -డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఆ విషయాన్ని హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం స్పష్టం చేయడం గమనార్హం.
డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయాన్ని రెండేళ్ల తరువాత గ్రహించిన గుడ్డి ప్రభుత్వం జగన్‌ది. ఈ విషయాలను దాచిపెట్టి -2019 జూన్‌లోనే భారీ వరదలు సంభవించాయని, ఆ వరదకే డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్టు కొత్త అబద్ధాన్ని తెరపైకి తెచ్చింది నీలిమీడియా. 2019 మే 30న ప్రమాణ స్వీకారం చేసిన ప్రభుత్వం.. జూన్ నాటికి అంటే నెల రోజుల వ్యవధిలో కాఫర్ డ్యాంలలో గ్యాప్‌లు ఎలా ఫిల్ చేస్తుందని అబద్ధాల వాదనకు దిగడం.. చేసిన నేరంనుంచి తప్పించుకునే సాహసమే.

## స్వయంగా పింఛన్లు అందజేయనున్న సీఎం చంద్రబాబు

**- పెనుమాకలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ**

అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం పెనుమాకలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను తన చేతుల మీదుగా అందజేయనున్నారు. దేశ చరిత్రలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎం పింఛన్ పంపిణీ చేయడం ఇదే తొలిసారి. సీఎం పర్యటనతో పెనుమాకలో భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు పింఛన్ లబ్ధిదారుల జాబితా సేకరించారు. తాజాగా పెంచిన రూ.1000తో నెలవారీ పింఛన్ రూ.4000 వేలకు చేరిన విషయం తెలిసిందే. పింఛన్ పెంపును ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వర్తింపజేస్తున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7వేలు జూలై 1న లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు స్వయంగా అందించనున్నారు. అనంతరం జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజలతో ముచ్చటిస్తారు.

రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 65,18,496మంది లబ్ధిదారులకు రూ.4,408 కోట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపిలు అంతా ఈ కార్య క్రమంలో భాగస్వాములు కానున్నారు.

## డీఎస్ మృతికి సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి: తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, ఉమ్మడి రాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్(డీఎస్) మృతికి సీఎం నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డీ.శ్రీనివాస్ మంత్రిగా, ఎంపీగా తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అన్నారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. శ్రీనివాస్ ఎప్పుడూ హుందాగా రాజకీయాలు చేసేవారని... తాను నమ్మిన సిద్ధాంతం కోసం పని చేశారని అన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం చంద్రబాబు ప్రార్థించారు.

## అమరావతిలో ప్రభుత్వ భవనాల కాంప్లెక్స్ ప్రాంతాన్ని నోటిఫై చేసిన సీఆర్‌డీఏ

**- 1575 ఎకరాల భూమిని నోటిఫై చేస్తూ గెజిట్ విడుదల**

అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వేగం పెంచింది. ఇప్పటికే ఒకసారి అమరావతిలో పరిశీలన జరిపిన సీఎం చంద్రబాబు పనులు వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో.. రాజధాని అమరావతిలో చేపట్టనున్న ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాల ప్రాంతాన్ని నోటిఫై చేస్తూ సీఆర్డీఏ శనివారం గెజిట్ జారీ చేసింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు ఉండనున్నాయి. ప్రభుత్వ కాంప్లెక్స్ ప్రాంతమైన 1575ఎకరాల ప్రాంతాన్ని సీఆర్డీఏ నోటిఫైచేసింది.మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జోనింగ్ నిబంధనల ప్రకారం నోటిఫై చేస్తున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ తెలిపారు. సీఆర్డీఏ చట్టం సెక్షన్-39 ప్రకారం సీఆర్డీఏ ఈ బహిరంగ ప్రకటన జారీ చేసింది. రాయపూడి, నేలపాడు, లింగాయపాలెం, శాఖమూరు, కొండమరాజుపాలెం గ్రామాల పరిధిలోని భూములను నోటిఫై చేశారు. ఈ ఉత్తర్వులతో భవనాల నిర్మాణానికి అడ్డంకులు తొలిగిపోతాయని, డిజైన్ల విషయంలో గతంలోనే క్లారిటీ ఉన్నందున కాంట్రాక్టు సంస్థకు పనులు ఇచ్చి, రికార్డు టైంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోబోతున్నారు.

# మీ కష్టాలు చూసి చలించిపోయా

- అందుకే పింఛన్ పెంపు ఏప్రిల్ నుంచే వర్తింపజేశా
- ఆర్థిక సమస్యలున్నా పింఛన్ పెంపుపై నిర్ణయం
- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రథమ కర్తవ్యం
- రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు బహిరంగ లేఖ



అమరావతి: ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడమే తమ ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలకు శనివారం చంద్రబాబు బహిరంగ లేఖ రాశారు. ప్రజలు ఎన్నో ఆశలతో తమను గెలిపించారన్నారు. వారి ఆకాంక్షలు నెరవేర్చడమే తమ ధ్యేయమన్నారు. మీ అందరి మద్దతుతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. మీకు అండగా నిలుస్తూ, సంక్షేమం చూసే ప్రజా ప్రభుత్వం కొలువుదీరింది. మీ ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడమే తక్షణ కర్తవ్యం. ఎన్నికలకు ముందే మ్యానిఫెస్టోలో చెప్పినట్లు పెన్షన్‌ను ఒకేసారి రూ.1000 పెంచాం. ఇకపై రూ.4000 పెన్షన్ ఇస్తాం. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలు ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది. జులై 1నుంచే పెంచిన పింఛన్లు ఇంటి వద్దే అందిస్తాం. 65,18,496 మంది పింఛన్ లబ్ధిదారులకు జూలై 1వ తేదీ నుంచే పెంచిన పింఛన్లు ఇంటి వద్ద అందిస్తాం. కొత్త ప్రభుత్వం ముందు అనేక ఆర్థిక సమస్యలు ఉన్నాయి. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే ప్రజలకు మంచి చేసే నిర్ణయాలు తీసుకున్నాం. పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు అదనంగా రూ.819 కోట్ల భారం పడుతుంది. అయినప్పటికీ ప్రజా శ్రేయస్సు కోసం ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి తీసుకొచ్చాం. ఎన్నికల సమయంలో వికృత రాజకీయాల కోసం ఆ నాటి అధికార పక్షం మిమ్మల్ని పెన్షన్‌విషయంలో ఎంతో క్షోభకు గురిచేసింది.

ఆ మూడు నెలలు మీరు పింఛన్ అందుకోవడానికి పడిన కష్టాలు చూసి నేను చలించి పోయా. మండుటెండలో, వడ గాల్పుల మధ్య మీరు పడిన అగచాట్లు చూశా. అందుకే ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంపును వర్తింప చేస్తానని మాటిచ్చాం. ఏప్రిల్, మే, జూన్ నెలలకు కూడా పెంపును వర్తింపచేసి అందిస్తున్నాం. నెలకు రూ.1000 చొప్పున మూడు నెలలకు పెంచిన రూ.3000, జూలై నెల పింఛన్ రూ.4000 కలిపి మొత్తం రూ.7000 మీ ఇంటికి తెచ్చి ఇస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### ఎన్టీఆర్ పేరుతో పెన్షన్ల పంపిణీ

సంక్షేమ పాలకుడు, సామాజిక పెన్షన్ విధానానికి ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్ పేరును పెన్షన్ల కార్యక్రమానికి పెట్టాం. ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇకపై మీ ఇంటి వద్దకొచ్చి సామాజిక పెన్షన్ల పంపిణీ జరుగుతుంది. పెరిగిన పెన్షన్‌తో మీకు ఆర్థిక స్వావలంబన, భరోసా లభిస్తుందని ఆశిస్తున్నాం. ప్రజా భద్రత మా బాధ్యత. ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాం. ఎప్పుడూ మంచి చేయాలని చూసే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నానని లేఖలో చంద్రబాబు కోరారు.

# గిరిజనులకు విశేష సేవలందించారు

**- రమేష్ రాథోడ్ మృతికి సీఎం చంద్రబాబు సంతాపం**



అమరావతి: తెలంగాణకు చెందిన ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మృతి పట్ల సీఎం నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. రమేష్ రాథోడ్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. రమేష్ రాథోడ్ అకాల మరణం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతో రమేష్ రాథోడ్‌కు ఉన్న అనుబంధాన్ని ఈసందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీగా, జడ్పీ ఛైర్మన్‌గా, ఖానాపూర్ ఎమ్మెల్యేగా గిరిజన ప్రజలకు రమేష్ రాథోడ్ విశేష సేవలందించారన్నారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### దిగ్భ్రాంతికి గురయ్యా: లోకేష్

ఇక, రమేశ్ రాథోడ్ హఠాన్మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని నారా లోకేష్ తెలిపారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ, నివాళులు అర్పిస్తున్నానని వివరించారు. టీడీపీతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉందని, ఈ విషాద సమయంలో రమేశ్ రాథోడ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని లోకేష్ పేర్కొన్నారు.

రమేష్ రాథోడ్ రాజకీయ ప్రయాణం టీడీపీతోనే మొదలైంది. మొదట జడ్పీటీసీగా ప్రస్థానం ప్రారంభించిన రాథోడ్... ఆ తర్వాత 1999 నుంచి 2004 వరకు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన ఖానాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు.

ఆ తర్వాత 2009లో ఆదిలాబాద్ ఎంపీగానూ విజయం సాధించారు. అంతకుముందు, ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మన్ గానూ వ్యవహరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీ నుంచి బయటికి వచ్చి బీఆర్ఎస్ లో చేరారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన... కొన్నాళ్లకే రాజీనామా చేసి బీజేపీలో చేరారు. గత సంవత్సరం జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఖానాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

## ఒకటో తేదీనే 90 శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

**- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం**

అమరావతి: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జూలై 1నే 90శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం సీఎస్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పింఛన్లకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు.జూలై 1వ తేదీన 65లక్షల 18వేల 496మందికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. పంపిణీకి సంబంధించి రూ.4వేల 399.89 కోట్లను విడుదల చేసినట్లు సీఎస్ తెలిపారు. అదే విధంగా పింఛన్ల పంపిణీకి అవసరమైతే ఇతర ప్రభుత్వ విభాగాల సేవలను కూడా వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్లు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్లు గంట గంటకూ పర్యవేక్షించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 6గంటలకు పింఛన్లు పంపిణీ ప్రారంభం కావాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూలై 1వ తేదీన 90శాతానికి పైగా పింఛన్లు పంపిణీ పూర్తిచేయాలని సీఎస్ ఆదేశించారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసిన మొత్తాన్ని శనివారం రాత్రి లోగా విత్ డ్రా చేసుకోవాలని స్పష్టం చేశారు.ఎక్కడైనా ఏ బ్యాంకైనా డబ్బును శనివారం రాత్రికి ఇవ్వలేకపోతే అలాంటి బ్యాంకులు ఆదివారం తెరిచి ఉంచి సంబంధిత పింఛన్ల మొత్తాన్ని ఇవ్వాలని సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

## కడప విద్యాశాఖ ఆర్జేడీపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

కడప: కడప జిల్లా విద్యాశాఖ ఆర్జేడీ రాఘవరెడ్డి అవినీతిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా విద్యాశాఖ అదనపు డైరెక్టర్‌ను నియమించింది. రాఘవరెడ్డి అక్రమాలపై మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్‌రెడ్డి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 'ఆర్జేడీ రాఘవరెడ్డి గతంలో డీఈవోగా పనిచేస్తున్న సమయంలో వైసీపీ నేతలతో అంటకాగుతూ విధులు నిర్వర్తించారు. ఉపాధ్యాయులను దూషించడం, మహిళా ఉపాధ్యాయినులతో అసభ్యకరంగా ప్రవర్తించడం, వారిని ఇష్టానుసారంగా బదిలీలు చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ లేకుండా లంచాలు తీసుకుని బదిలీలు, డిప్యుటేషన్లు చేయడమే కాకుండా వీటిపై ప్రశ్నించిన వారిని విధుల నుంచి తొలగించారు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించకున్నా అనుమతులిచ్చారు. 2023, మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేశారు. ఆయన తీరుపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తే నా అంతు చూస్తానని ఆర్జేడీ బెదిరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఈయన కోట్లాది రూపాయలు వసూలు చేసి అక్రమ బదిలీలు చేశారు' అని భూమిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు

## ప్రసాద్‌రెడ్డి రాజీనామా చేసినా వదిలిపెట్టం

**- బీజేపీ ఎంపీ సీఎం రమేష్**

విశాఖపట్నం: ఆంధ్రా యూనివర్శిటీలో చాలా అక్రమాలు, అన్యాయాలు జరిగాయని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. ఇందుకు కారణ మైన వైస్ ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డి రాజీనామా చేసినా వదిలేది లేదన్నారు. ప్రసాద్‌రెడ్డి అక్రమాలపై రాష్ట్ర అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదుచేస్తామని చెప్పారు. కాగా ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ రాజీనామాలతో యూనివర్సిటీలో విద్యార్థులు సంబరాలు చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రసాద్‌రెడ్డి చేసిన అక్రమాలపై, చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఏయూలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీ కృష్ణ యాదవ్ పర్యటించారు. ఉద్యోగులు, విద్యార్థులతో నేతలు మాట్లాడుతూ ప్రసాద్‌రెడ్డి అక్రమాలు, దురాగతాలపై న్యాయపరమైన విచారణ చేయిస్తా మని తెలిపారు. విశ్వవిద్యాలయంలో రాజకీయాలు ఉండకూడదని అన్నారు. విశ్వవిద్యాలయంలో రాజకీయ నాయకుల విగ్రహాలు ఉండకూడదన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల అభిప్రాయాలు తెలుసు కుని ముందుకు వెళ్తామని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా స్పెషల్ ఎగ్జామ్స్ నిర్వహించారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఏయూలో ప్రసాద్‌రెడ్డి అనేక అవకతవకలకు పాల్పడ్డారన్నారు. వీటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రసాద్‌రెడ్డి వల్ల ఇబ్బందులకు గురైన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఏయూకు పూర్వవైభవం తీసుకువస్తామని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.





# వినతుల వెల్లువ

## స్వయంగా స్వీకరించిన సీఎం చంద్రబాబు

అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వినతులు వెల్లువెత్తాయి. శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లిన చంద్రబాబు నాయుడుని వందల మంది కలిసి వినతులు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సామాన్య ప్రజలు, కార్యకర్తలు ముఖ్యమంత్రిని కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. తమ వ్యక్తి గత సమస్యలను విన్నవించి సాయం అర్థించారు. ఓపిగ్గా అందరి నుండి వినతి పత్రాలు తీసుకున్న చంద్రబాబునాయుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భారీగా తరలి వస్తున్న ప్రజలను కలిసేందుకు ఇకపై ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని పార్టీ నేతలకు సూచించారు.



















## కొండగట్టు ఆంజన్నను దర్శించుకున్న పవన్

- ఆలయం వద్ద స్వాగతం పలికిన అధికారులు
- ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏపీ డిప్యూటీ సీఎం

జగిత్యాల: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో ఉన్న సుప్రసిద్ధ కొండగట్టు అంజన్న పుణ్యక్షేత్రానికి విచ్చేశారు. ఉదయం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరిన పవన్ కల్యాణ్ మధ్యాహ్నం కొండగట్టు చేరుకున్నారు.
ఆలయ వర్గాలు పవన్‌కు సంప్రదాయరీతిలో స్వాగతం పలికాయి. అనంతరం పవన్.. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కులు చెల్లించుకున్నారు. జనసేనాని పవన్ కల్యాణ్ ప్రస్తుతం వారాహి అమ్మవారి దీక్షలో ఉన్నారు. ఆయన గతంలోనూ కొండగట్టు వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కొండగట్టుకు పవన్ వచ్చిన నేపథ్యంలో, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, పవన్ రాకతో కొండగట్టులో కోలాహలం మిన్నంటింది. ఆలయం వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. అందరికీ అభివాదం చేస్తూ పవన్ ముందుకు సాగారు.

## వేల కోట్లు దోచేసిన బియ్యం మాఫియా

- కాకినాడ కేంద్రంగా విదేశాలకు తరలింపు
- సీఐడీ విచారణకు ఆదేశిస్తాం
- మంత్రి నాదెండ్ల స్పష్టీకరణ



కాకినాడ: రేషన్ మాఫియాకు కాకినాడ అడ్డాగా మారిందని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం విదేశాలకు ఎగుమతి చేసి వేల కోట్ల రూపాయలు ఆర్జించారని మండిపడ్డారు. దీనిపై సీఐడీ విచారణ జరిపిస్తామన్నారు.
గత ప్రభుత్వ హయాంలో రేషన్ మాఫియా బరితెగించింది. అప్పటి కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నేతృత్వంలో మాఫియాగా ఏర్పడిన కొందరు నేతలు పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం విదేశాలకు తరలించి వందల కోట్ల రూపాయలు దోపిడీ చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రెండు రోజులుగా కాకినాడలోనే మకాం వేసి ఆరా తీస్తున్నారు. పౌరసరఫరాల శాఖపై కాకినాడలో రెండో రోజు శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ బియ్యం మాఫియాపై సీఐడీ విచారణకు సిద్ధమని ప్రకటించారు. కాకినాడ పోర్టు ద్వారా పేదలకు అందాల్సిన రేషన్ పెద్ద ఎత్తున పక్కదారి పట్టిందని, కోట్లాది రూపాయల కుంభకోణం అని మండి పడ్డారు.
కాకినాడ పోర్టు నుండి విదేశాలకు సరుకులు ఎవరి సహాయంతో వెళ్లాయి, రేషన్ మాఫియాలో ఎవరెవరు ఉన్నారు, అక్రమబియ్యం దందాలో ఉన్న గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, కీలక నేతలు ఎవరో మొత్తం తేలుస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో దోపిడీకి కొంత మంది అధికారులు కూడా సహకరించారని, వారి సంగతి కూడా తేలుస్తామన్నారు.
ఇక నుండి రేషన్ షాపుల్లో పట్టిక ఉంటుందని, ఏయే రకాల సరుకులు ప్రభుత్వం అందిస్తోంది,ఒక కుటుంబానికి ఎంత మొత్తం ఇస్తుంది, ఎంత ధరకు ఇస్తుందో పారదర్శకంగా ప్రతి రేషన్ దుకాణంలో బోర్డు పెట్టిస్తామని ప్రకటించారు. మంత్రి పర్యటన ఉందని తెలిసి గోదాముల నుండి 4 రోజులుగా అక్రమ బియ్యం తరలించారని చెప్పారు. కాకినాడలో తొలిరోజు తనిఖీల్లో 6 గోదాముల్లో లోపాలు గుర్తించాం. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు గుర్తించాం. 7615 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశాం. కాకినాడలో ఒక వ్యవస్థీకృత మాఫియా ఏర్పడింది. ఇక్కడి రేషన్ మాఫియా సొంత నౌకనే ఏర్పాటు చేసుకునే స్థాయిలో ఉంది. కాకినాడ పోర్టు అంటేనే అందరూ భయపడుతు న్నారు. తనిఖీల్లో ఆరు సంస్థల పాత్రను గుర్తించాం. వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

## పులివెందులలో జగన్‌కు షాక్ తప్పదా?

- పెండింగ్‌లో రూ.200 కోట్ల బిల్లులు
- పనులు చేసిన కౌన్సిలర్లలో ఆందోళన
- భరోసా ఇవ్వని జగన్, అవినాష్
- టీడీపీ వైపు పలువురు కౌన్సిలర్ల చూపు

కడప: పులివెందులలో జగన్‌రెడ్డికి భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో పట్టణంలో పెద్ద ఎత్తున పనులు చేయించి వాటికి బిల్లులు రాకపోవడంతో పలువురు కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో చేసిన పనులకు దాదాపు రూ.200 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు చేశామని, ఇప్పుడు బిల్లులపై పార్టీ అధినేత జగన్‌రెడ్డి ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో పలువురు కౌన్సిలర్లు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. చాలా మంది టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల పులివెందుల పర్యటనకు వెళ్లిన జగన్‌రెడ్డిని,ఆయన సతీమణి భారతిరెడ్డిని కూడా కౌన్సిలర్లు కలిసి తమ గోడు చెప్పుకున్నారు. బిల్లులు ఇప్పించకపోతే అప్పుల పాలైపోతామని ఆస్తులు అమ్మినా తీరవని ఆవేదన వ్యక్తంచేశారు. అయితే వారికి జగన్ కానీ.. భారతి కానీ భరోసా ఇవ్వలేదు. కోర్టుకైనా వెళ్లి పోరాడదామని చెప్పి బెంగళూరు వెళ్లిపోయారు. కోర్టుకు వెళ్తే ఇక బిల్లులురావని కౌన్సిలర్లు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో వారంతా టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలియడంతో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి రంగంలోకి దిగారు. శనివారం పులివెందులలో కౌన్సిలర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేశారు. వారందర్నీ ఆయన బుజ్జగించే ప్రయత్నంచేశారు. బిల్లులపై ప్రభుత్వం ఏనిర్ణయం తీసుకుంటుందో చూద్దామనిచెప్పారు. అయితే అవినాష్‌రెడ్డి కూడా ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇవ్వలేదు. దీంతో పులివెందుల కౌన్సిలర్లు ఇబ్బంది పడుతున్నారు. రూ.200 కోట్ల పెద్ద మొత్తంలో బిల్లులు పెండింగ్ పెట్టుకుని వడ్డీలు కట్టుకోలే మంటున్నారు. బిల్లులపై జగన్ కనీసం భరోసా కూడా ఇవ్వకపోవడంతో పార్టీలో ఎలా ఉండగలమని వారు అంటున్నారు. బిల్లులు ఇప్పిస్తే టీడీపీలోకి వస్తామని బీటెక్ రవికి సమాచారం పంపించారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల కౌన్సిలర్లు టీడీపీలో చేరితే పరువు పోతుందని వైసీపీలో కలవరం మొదలయింది.

## యోగి వేమన వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా

అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నేపథ్యంలో... వైసీపీ అనుకూలురని ముద్రపడిన వర్సిటీ వీసీలు, రిజిస్ట్రార్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా కడప యోగి వేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పదవికి చింతా సుధాకర్ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఏపీ ఉన్నత విద్యా మండలి ఆమోదించింది. యోగి వేమన వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య కూడా రాజీనా మా చేశారు. వెంకటసుబ్బయ్య రాజీ నామాను ఉన్నత విద్యామండలి ఆమోదించింది.
చింతా సుధాకర్, వెంకటసుబ్బయ్య తమ పదవీకాలంలో వైసీపీకి సన్నిహితంగా మెలిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిద్దరి రాజీనామాల నేపథ్యంలో... యోగి వేమన వర్సిటీ ఇన్చార్జి రిజిస్ట్రార్‌గా వర్సిటీ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అటు, నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ పదవికి రామచంద్రారెడ్డి రాజీనామా చేశారు. ఆయన కడపలోని యోగి వేమన వర్సిటీలో ప్రొఫెసర్‌గా చేరారు.

## ఇదే దేవుడి స్క్రిప్ట్ అంటే!

- నన్ను అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసులే... ఇప్పుడు సెల్యూట్ చేస్తున్నారు
- సన్మానసభలో అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు
- స్పీకర్ పదవి బాధ్యతగా నిర్వర్తిస్తానని స్పష్టీకరణ
- పౌరసన్మానంలో పాల్గొన్న హోంమంత్రి అనిత, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు

నర్సీపట్నం (చైతన్యరథం): గతంలో తనను అక్రమ అరెస్టులతో అనేక ఇబ్బందులకు గురిచేసిన పోలీసులే ఇప్పుడు సెల్యూట్ చేస్తున్నారని, దేవుడి స్క్రిప్ట్ అంటే ఇదేనని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో నన్ను ఎంతో అవమానించి... మెడపట్టి తోసేసిన అధికారులే ఇప్పుడు తనకు వినయంగా నమస్కరిస్తున్నారంటే విధి ఎంతటి బలీయమైందో అర్థం చేసుకోవాలన్నారు. నా బాడీ లాంగ్వేజ్ కి స్పీకర్ కుర్చీకి సరిపోతుందో లేదో తనకు తెలియదని, అయినా రాజ్యాంగ పదవిని బాధ్యతతో నిర్వహిస్తానని అయ్యన్న వెల్లడించారు. శనివారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో స్పీకర్ అయ్యన్నకు స్థానికులు పౌర సన్మానసభ నిర్వహించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే వెలగపూడి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, జనసేన నాయకులు, తదితరులు పాల్గొని స్పీకర్ అయ్యన్నను సన్మానించారు.
ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ... 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాకు స్పీకర్ పదవి ఇచ్చి నా నోటికి ప్లాస్టర్ వేశారు. నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు పెట్టిన రాజకీయ భిక్ష కారణంగానే ఇంత కాలం వివిధ హోదాల్లో పదవులు చేపట్టి వాటికి తగిన న్యాయం చేశా. ప్రస్తుతం రాజకీయాలు జూదంగా మారిపోయాయి. విలువలు కాపాడుకోవాల్సిన పరిస్థితులు దాపరించాయి. రాష్ట్ర ప్రజలకు న్యాయం చేసేందుకు నావంతు కృషి చేస్తా. ప్రస్తుతం సభలో వైసీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే ఉన్నాయని, అయినా వారికి ఇవ్వాల్సిన గౌరవాన్ని వారికి ఇచ్చి సభ సజావుగా జరిగేలా చూస్తాను. ప్రజా సమస్యలపై చర్చించేందుకు సంఖ్యా బలమే అవసరమే లేదు. ప్రజా సమస్యలపై చర్చ జరిగిందా? లేదా? అనేది ముఖ్యం. గతంలో ఒక్కరిద్దరు ఉన్నా వారికి సమయం కేటాయించారు. కాబట్టి వైసీపీ నాయకులు స్వేచ్ఛగా అసెంబ్లీకి వచ్చి వారి సమయాన్ని వినియోగించుకోవాలని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

### రెడ్ బుక్ అయ్యన్న వద్ద ఉంటేనే బాగుంటుంది: హోంమంత్రి అనిత

వైసీపీ పాలనలో టీడీపీ శ్రేణులు, నాయకులను వేధించిన వారిపై చర్యలు తీసుకునేలా రూపొందించిన రెడ్‌బుక్ నా కంటే అయ్యన్న పాత్రుడు వద్ద ఉంటేనే బాగుంటుందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు అయ్యన్నను ఏదో విధంగా ఇబ్బంది పెట్టాలని చూశారు. అరడుగుల స్థలం కోసం వందల మంది పోలీసులను గోడలు దూకించారు. టీడీపీ బావుండాలని కోరుకునే ఏకైక వ్యక్తి అయ్యన్న. మాలాంటి అందరికీ అయ్యన్న ఆదర్శప్రాయుడు. జగన్‌కు అయ్యన్నపాత్రుడు అంటే భయమేమో.. తెలియదు కానీ.. స్పీకర్‌గా ప్రకటించినప్పటి నుంచి శాసనసభకు రాలేదు. అయ్యన్నను భిక్ష అడిగితే గాని వైసీపీకి ప్రతిపక్ష హోదా రాని పరిస్థితి. జగన్ విషయంలో ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్' అని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు.





## ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య




జగ్గయ్యపేట (చైతన్యరథం): పట్టణంలో బస్టాండ్ వద్దగల స్మైల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ సేవలు మరియు జీహెచ్ఎస్ సేవలను జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ యాజమాన్యం డా: సందీప్, డా: వెంకట్, డా: అవినాష్ మరియు రిటైర్డ్ ఉద్యోగులు, హాస్పటల్ సిబ్బంది మరియు ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం బకాసురులందరి బండారం త్వరలోనే బట్టబయలు

**- హెచ్చరించిన టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): రాష్ట్రంలో పేదల బియ్యం బొక్కేసి, అడ్డదారుల్లో వందలు, వేల కోట్లకు పడగలెత్తిన వైసీపీ బియ్యం బకాసురులందరి బండారం త్వరలోనే బట్టబయలు చేస్తామని మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. పేదలు, బీదల ఆకలి తీర్చే రేషన్ బియ్యాన్ని పక్క దారి పట్టించి బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకున్న దొంగలు ఏ స్థాయిలో ఉన్నవారైనా ప్రజాప్రభుత్వంలో వదిలిపెట్టే ప్రసక్తే ఉండదన్నారు. కొద్దిరోజులుగా పౌరసరఫరాల శాఖకు సంబంధించి వెలుగు చూస్తున్న విస్తుపోయే వాస్తవాల నేపథ్యంలో శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గడిచిన అయిదేళ్లలో ప్రతి నియోజకవర్గంలో చోటుచేసుకున్న రేషన్ బియ్యం అక్రమాలన్నీ తవ్వితీయాల్సిన సమయం వచ్చిందన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఏ ఏ దేశాలకు ఎంతెంత దొంగతనంగా ఎగుతులు చేశారు, ఆ బియ్యం ఏ ఏ ప్రాంతాల నుంచి అక్కడికి ఎలాచేర్చారో మొత్తం వెలికితీస్తే సగమంది వైసీపీ నేతలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమన్నారు.

తమ చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించి మాజీమంత్రి విడదల రజనీపై కూడా ఇదే విషయంలో తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్నిఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు గుర్తుచేశారు. పేదల బియ్యాన్ని దారిమళ్లించి, మిల్లుల ద్వారా వేలకోట్లు వెనకేసుకున్న పెత్తందార్లు, వారికి వెన్నుదన్నుగా నిలిచి వారిని చట్టం ముందు నిలబెట్టాల్సి ఉందన్నారు. జూన్-4 నుంచి ఆ దొంగల పాలనకు, సంక్షేమయుగానికి మధ్య తేడాను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. చెప్పిన మాట ప్రకారం తొలిఅయిదు సంతకాల్లోనే పింఛన్ల పెంపునకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబును పేదలంతా గుండెల్లో పెట్టుకుంటున్నారని తెలిపారు. నాడు - నేడు కూడా పింఛన్ల పెంపుతో అవ్వాతాతల కళ్లలో నిజమైన ఆనందం, వెలుగులు నింపారని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉండి, ప్రతినెలా వందల కోట్లు భారం పడుతున్నా ఇచ్చినమాట ప్రకారం పింఛనును రూ.4వేలు చేసిన నిజమైన ఛాంపియన్ చంద్రబాబు అని పుల్లారావు కొనియాడారు.



ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ మెంటేనెన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధికి ప్రముఖ సినీ నటుడు రావు రమేష్ రూ.3,00,000 విరాళం అందించారు. తన పిలుపు మేరకు స్పందించి తన సహకారం అందించిన రావురమేష్‌కు ఆర్ఆర్ఆర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# వైసీపీ రాజమహల్‌కి సొమ్మెక్కడిది?

**- కార్పొరేషన్, రుడా అధికారులు చూద్యం చూసారా?**
**- ఎక్కడికక్కడ కబ్జాలు చేశారు.. జగన్ అవినీతికి అంతేలేదు**
**- సహకరించిన అధికారులెవ్వరినీ వదిలిపెట్టబోము**
**- వైసీపీ ఆఫీసు పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యాఖ్యలు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం) : రాజ్ మహల్స్ ని తలపించే రీతిలో వైసిపి ఆఫీసుల నిర్మాణం ఎలాంటి అనుమతులు లేకుండా చేయడం శోచనీయమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సకల సౌకర్యాలతో ఇంత పెద్ద ఆఫీసు నిర్మాణానికి సొమ్మెకడిదని ఆయన నిలదీశారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వెనుక నిర్మిస్తున్న వైసిపి ఆఫీసుని శుక్రవారం ఆయన టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి మనేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ, అలాగే ఇతర కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కూతవేటు దూరంలో ఉన్న బీసీ హాస్టల్ లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వ స్థలంలో అతి తక్కువ సొమ్ముకి లీజుకి తీసేసుకుని, ఎలాంటి అనుమతులు లేకుండా ఇంతటి పెద్ద భవనాలు చేపట్టడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్యాలస్ మాదిరిగా నిర్మించే వైసిపి ఆఫీసులో పెద్ద గదులు, పెద్ద బెడ్ రూమ్, వెనుక హెలిపాడ్ సౌకర్యం, అలాగే ఇంకోవైపు రాజ మార్గం .. ఇవన్నీ చూస్తుంటే పార్టీ ఆఫీసు అని చెబుతున్నారుగానీ అలా కన్పించడం లేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎద్దేవా చేసారు. ఇంతటి పెద్ద పెద్ద కార్యాలయాలు ప్యాలస్ మాదిరిగా జగన్ మోహన్ రెడ్డి ఎందుకు కట్టుకున్నారో అర్థం కావడం లేదన్నారు. కాకినాడలో తెలుగుదేశం ఆఫీసు ఒకసారి చూస్తే ఈ ఆఫీసులో ఒక ముక్కగా ఉంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మరి ఇక్కడ చూస్తే అధికారం ఉన్నామనే అహంకారంతో ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కట్టారని ఆయన విమర్శించారు. వైసిపి వాళ్ళు ఇష్టానుసారంగా ప్రభుత్వ ఆస్తులను దోచేశారని ఆయన ధ్వజమెత్తారు. దోచిన డబ్బుతో ఇష్టానుసారంగా కట్టేశారని ఆయన ఆరోపించారు. పార్టీ కార్యాలయాలు కట్టుకోవడంలో చూపిన శ్రద్ధ తెలుగుదేశం ప్రభుత్వం కట్టిన టిడ్కో ఇల్లు లబ్దిదారులకు ఇవ్వడంలో శ్రద్ధ వైసిపి ప్రజాప్రతినిధి ఎవరైనా చూపించారా అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు. అవ భూములను దోచేసుకోవడంలో చూపిన శ్రద్ధ ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమంలో చూపించలేదన్నారు.

హాస్టల్స్ లో టాయిలెట్స్ పాడైపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే కనీసం పట్టించుకోలేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. అంటువ్యాధులు వస్తున్నాయని మరమత్తులు చేయమని అడిగితె ఏనాడూ అక్కడి పరిస్థితులను వైసిపి ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైసిపి ఆఫీసులో మెట్లు ల్యాండింగ్ కి అయ్యే ఖర్చు పెడితే చాలు బిసి హాస్టల్ లో బాత్ రూమ్స్ సరిచేసేయొచ్చని అన్నారు. అదే తాము వచ్చాక ఒక దాతను అడిగి పదిరోజుల్లో బిసి హాస్టల్ లో టాయ్ లెట్స్ బాగుచేయించామని ఆయన చెప్పారు. వైసిపి వాళ్ళు ఐదేళ్లు ఏమీ చేయలేదని, దోచుకుని జేబులు నింపుకుని, ప్రభుత్వ ఆస్తులు కబ్జా చేసారని ఆయన ధ్వజమెత్తారు. వైసీపీ వాళ్ళు చేసిన దారుణాతి దారుణాలకు అధికారులు సహకరించారని ఆయన వాపోయారు. పర్మిషన్ లేకుండా ఇంత పెద్ద భవంతి కడుతుంటే కార్పొరేషన్ అధికారులు ఏంచేశారని, రుడా ఏంచేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిలదీశారు. సహకరించిన అధికారులను ఎవ్వరినీ వదిలిపెట్టబోమని ఆయన స్పష్టంచేశారు. ఇప్పుడు నోటీసులు ఇచ్చేశామంటే కుదరదని, ఇంతలా కట్టేసేవరకు ఏంచేసారో కూడా చెప్పాలని, చెప్పేవిధంగా చర్యలుంటాయని ఆయన అన్నారు.

# పంచాయతిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**- పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా**



కోవూరు (చైతన్యరథం): బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రంలోని నగర పంచాయతీ కార్యాలయానికి శనివారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె.. కమిషనర్ రమణబాబుని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యలపై ఆరా తీశారు. ప్రధానంగా నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తెచ్చారు. దాంతో ఆ సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి పరిష్కరించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించారు. అదేవిధంగా నీటి నిర్వహణ, పారిశుధ్యం, ప్రజా మరుగుదొడ్ల సమస్యలపై కూడా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆరా తీశారు. బుచ్చి పట్టణ అభివృద్ధిపై యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం వద్దని ప్రశాంతిరెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో డయేరియా కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో దీనిపై దృష్టి సారించాలన్నారు. ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకూడదని ఆదేశించారు. దోమల వ్యాప్తి జరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

# చిత్తూరును గంజాయి ఫ్రీ జిల్లాగా మార్చాలి

**- వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలి**
**- చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు**
**- తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని విన్నపం**



చిత్తూరు (చైతన్యరథం): చిత్తూరు జిల్లా లో కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న సుమిత్ కుమార్‌ను టీడీపీ నాయకులు వెళ్లి కలిసి అనేక ప్రజా సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న గంజాయి వ్యాపారులపై ఉక్కుపాదం మోపడంతో పాటు చిత్తూరు గంజాయి ఫ్రీ జిల్లాగా మార్చాలని కోరారు. ఈ మేరకు శనివారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు జిల్లా కలెక్టర్ ను కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... చిత్తూరు జిల్లాలో విస్తరిస్తున్న డయేరియాను కంట్రోల్ చేసి, తక్షణం గ్రామాల్లో పారిశుద్యం పనులని మెరుగుపరచాలని, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది, వైద్యారోగ సిబ్బంది, గ్రామాల్లో నిత్యం పర్యటించాలని విజ్ఞప్తి చేశారు. మందులు, మాత్రలు అన్నీ కూడా అందుబాటులోకి పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో విద్యుత్ శాఖ లో దాదాపు 700 ఉద్యోగాలని ఎన్నికలకు ముందు భర్తీ చేసి లక్షలాది రూపాయలు చేతులు మారిన వ్యవహారంపై విచారణ జరిపించాలని ఇందులో సూత్రదారిగా ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన నియామకాల్లో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారిందని, నిరుద్యోగులను మోసం చేశారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

పూతలపట్టు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచి, విద్యార్థులకు సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమస్యలను జిల్లా కలెక్టర్‌కి వివరించగా సావధానంగా విని పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారని టీడీపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయచంద్ర నాయుడు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, టీడీపీ నాయకులు సురేష్ పాల్గొన్నారు.

చైతన్యరథం

# రాజకీయాల్లో కమిట్మెంట్ చాలా ముఖ్యం

- పదవులు వస్తాయి... పోతాయి... కానీ క్యారెక్టర్ అవసరం
- బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో ఎంపీ కేశినేని శివనాథ్ కు ఆత్మీయ సత్కారం
- ముఖ్యఅతిధులుగా పాల్గొన్న పలువురు టీడీపీ నేతలు

విజయవాడ( చైతన్యరథం): విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, చెన్నుపాటి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ.. రాజకీయాల్లో పదవులు వస్తాయి.. పోతాయి.. కానీ కమిట్మెంట్ చాలా ముఖ్యమని.. అటువంటి కమిట్మెంట్ ఉన్న నేత కేశినేని శివనాథ్ అని పేర్కొన్నారు. అవతల వారు వ్యక్తిగతంగా దూషించినా సమన్వయంతో ఉన్నారన్నారు. ఎప్పుడు వారి ఇంట్లో వాళ్లని ఒక్క మాట కూడా అనకుండా సంస్కారం చూపిన గొప్ప వ్యక్తి కేశినేని చిన్ని అని బుద్దా వెంకన్న కొనియాడారు. నేడు తిరుగులేని విజయంతో చిన్ని రికార్డు సృష్టించారని తెలిపారు. ఆయన చేసిన సర్వీసు ప్రజల్లోకి బాగా వెళ్లిందని బుద్దా వెంకన్న పేర్కొన్నారు. కష్టం ఉందని కలిసిన ప్రతి వ్యక్తికి చిన్ని అండగా నిలిచారన్నారు. ఆర్థికంగా, ఉద్యోగం, ఉపాధి, విద్యా పరంగా సేవలు అందించారన్నారు. కేశినేని చిన్ని ఇదే నియోజకవర్గం నుంచి ఎంపీగా హ్యాట్రిక్ సాధిస్తారన్నారు. అందుకే తామంతా కలిసికట్టుగా పని చేస్తామని బుద్దా వెంకన్న తెలిపారు. పార్లమెంటు భవనంలో మూడోసారి ప్రమాణ స్వీకారం చేసే వరకూ తాను వెన్నంటే ఉంటానన్నారు. శ్రీరాముడికి ఆంజనేయుడు ఎలాగో.. సీఎం చంద్రబాబుకు తాను కూడా అంతేనని బుద్దా వెంకన్న తెలిపారు. చంద్రబాబు సీఎంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో కేశినేని నాని ఎంపీగా ఎన్నికైన తరువాత చంద్రబాబుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని బుద్దా వెంకన్న గుర్తు చేశారు. అందువల్లే తామంతా ఆయన్ని వ్యతిరేకించాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు కేశినేని చిన్ని సారధ్యంలో మేమంతా పని చేస్తామని స్పష్టం చేశారు. కేశినేని శివనాథ్ చిన్ని మాకు నాయకత్వం వహిస్తారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో మేమంతా కేశినేని చిన్నితో కలిసి ప్రయాణం చేస్తామని వెల్లడించారు. ఆయనపై అనవసరంగా నోరు పారేసుకుంటే మా పోరాటం ఇక్కడ నుంచే మొదలు పెడతామని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు.

**నేను అందరి మనిషిని : కేశినేని శివనాథ్ (చిన్ని)**

నేను ఎప్పుడూ అందరి మనిషిని, ప్రజల మనిషిని బుద్దా వెంకన్న, నాగుల్ మీరా ప్రోత్సాహంతోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను అని, నా గెలుపులో వారందించిన సహకారం మరువలేనిదని అన్నారు. 'గతంలో కేశినేని నాని చేసిన వ్యాఖ్యాలు నన్ను బాధించాయి. ఇంత భారీ విజయంతో నాపై బాధ్యత మరింత పెరిగింది. నా శక్తి వంచన లేకుండా అభివృద్ధి కోసం పని చేస్తా. ఉడతా భక్తిగా నా వంతు సేవా కార్యక్రమాలు చేస్తా. బుద్దా వెంకన్న, నా లాంటోళ్లు మనసులో పెట్టుకుని పైకి వేరే మాట్లాడం. మాకు ఏదనిపిస్తే అదే ఓపెన్ గా చెబుతాం. టీడీపీ కోసం పని చేసిన వారికి మంచి గుర్తింపు ఉంటుంది. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరం కలిసి పని చేద్దాం. కూటమి పొత్తు వల్ల సీనియర్ నాయకులకు అన్యాయం జరిగింది. కానీ భవిష్యత్తు లో అందరికీ న్యాయం చేసేలా నా వంతు కృషి చేస్తా. కార్యకర్తలు నుంచి నాయకుల వరకు నాతో నడిచిన అందరినీ గుర్తు పెట్టుకుంటా. మనందరం టీడీపీ అభివృద్ధి కోసం పని చేద్దాం.' అని కేశినేని చిన్ని స్పష్టం చేశారు.



**కేశినేని శివనాథ్ ఎంతో సౌమ్యుడు : నాగుల్ మీరా**

విజయవాడ ఎంపీగా విజయం సాధించిన కేశినేని శివనాథ్ ఎంతో సౌమ్యుడు అని టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా వ్యాఖ్యానించారు. 'కేశినేని శివనాథ్ చిన్ని వంటి నేత ఎంపి కావడం మన అదృష్టమని, చంద్రబాబు బాధ్యత అప్పగించిన వెంటనే యస్టీఆర్ జిల్లాలో ప్రతి పల్లె లో పర్యటించారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రజలను కలిసి సేవలు అందించారు. 2.80లక్షల మెజారిటీ తో చిన్ని కి ఎంపి గా ప్రజలు పట్టం కట్టారు. ఒక్క పశ్చిమ నియోజక వర్గం లోనే 55వేల మెజారిటీ వచ్చింది. చిన్ని వంటి నేత ను గెలిపించాలని కూటమి పార్టీ ల నేతలు చేసిన కృషి అభినందనీయం. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిల పెట్టుకునే విధంగా ప్రజల కోసం పని చేస్తాం' అని నాగుల్ మీరా వ్యాఖ్యానించారు.

## జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తాం

### మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి



కర్నూలు (చైతన్యరథం): గత పాలకుల నిర్లక్ష్యంతో జిల్లాలో అభివృద్ధి కుంటు పడిందని సమిష్టి కృషితో జిల్లాను అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లతో కలిసి మంత్రులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ... ప్రజలకు వాగ్దానం చేసిన మేరకు ప్రభుత్వం అన్ని కార్యక్రమాలు చేసుకుంటూ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల నంద్యాల పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అదనపు ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. గోరుకొల్లు రిజర్వాయర్ నుండి అదనపు పైప్లైన్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 13 లక్షల 58 కోట్ల రూపాయల అప్పు ప్రస్తుత ప్రభుత్వం మీద పెట్టిందని ఆర్థిక లోటు తీవ్రంగా ఉన్నప్పటికీ అప్పులు తీర్చడంతోపాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అన్ని వర్గాల పెన్షన్ దారులకు పెంచిన వేయి రూపాయలు మొత్తాన్ని కలిపి జూలై 1వ తేదీన ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించి పెరిగిన పెన్షన్ సొమ్ము నెలకు వెయ్యి రూపాయలు చొప్పున మూడు మాసాల అరియర్స్ కలుపుకొని మొత్తం 7000 వేల రూపాయలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నామని మంత్రి వివరించారు. గతంలో నంద్యాల జిల్లా నెలకు 65.86 కోట్ల రూపాయలు పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేసేవారని ప్రస్తుత జూలై మాసంలో అరియర్స్ తో కలిపి 150.23 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

జిల్లాలో 2,21,240 మంది పెన్షన్దారులకు ప్రతినెల 93.14 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపేదల సుఖసంతోషాలను దృష్టిలో పెట్టుకొని పెన్షన్ మంజూరులపై మొట్టమొదటి సంతకం చేశారన్నారు.

రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ... రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన లాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశారన్నారు. మైనింగ్ శాఖలో అక్రమంగా ఇసుక, ప్రకృతి సంపదలను అనుమతులకు మించి త్రవ్వకోవడం తద్వారా ప్రభుత్వానికి రావలసిన రాయల్టీకి గండి కొట్టి తీవ్రంగా నష్టపరిచారని వీటన్నిటిపై సమగ్ర నివేదికలు అధికారుల నుండి తెప్పించుకొని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ కమిటీలతో విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. అటవీ ప్రాంతాల్లో కూడా కొండలను కొల్లగొట్టి, ప్రకృతి సంపదను విచ్చలవిడిగా దోచుకొని అసాంఘిక సంఘటనలకు పాల్పడిన వ్యక్తులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. జిల్లాలో రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయని అన్ని నియోజకవర్గాల్లోని శాసనసభ్యుల ద్వారా నివేదికలు తెప్పించుకొని డిపిఆర్ సిద్ధం చేసి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థ కూడ నిర్వీర్యం అయిందని గ్రామాల్లో వీధిలైట్లు, మురుగు కాలువలు, అంతర్గత రోడ్లు లేవని.... రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

అలాగే నాబార్డ్ ద్వారా వచ్చిన 370 కోట్ల రూపాయలు ఏమయ్యాయో తెలియడం లేదని మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్రంలో రోడ్లు భవనాల శాఖకు సంబంధించి గత ప్రభుత్వంలో గుత్తేదారులకు 2700కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని మంత్రి తెలిపారు. పార్టీ కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులను న్యాయబద్ధంగా పోరాటం చేసి కాపాడుకుంటామని మంత్రి వివరించారు.

## చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

- 7వ డివిజన్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



విజయవాడ తూర్పు (చైతన్యరథం): చంద్రబాబు నాయుడు పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందు తుందని తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 7వ డివిజన్ జమ్మిసెంటర్ వద్ద గల ఎల్.ఎస్ టవర్స్లో కాలనీ వాసులతో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆత్మీయ సమావేశం శనివారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీలపై నమ్మకంతోనే ప్రజలు కూటమి అభ్యర్థులకు ఇంతటి ఘన విజయాన్ని అందించారని చెప్పారు. జగన్మోహన్రెడ్డి అనుసరించిన విధానాల వల్ల ప్రజలు పడిన కష్టాలు, చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగే లాభాల గురించి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి వివరించడం, వాటిని ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మూడోసారి గెలవడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేగా తాను గెలుపొందటానికి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటుగా జగన్మోహన్రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అనుసరించిన ప్రజావ్యతిరేఖ విధానాలు కూడా కారణమని అన్నారు. జగన్ అనుసరించిన విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని అందువల్ల కూటమికి పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించారన్నారు. చంద్రబాబునాయుడికి పవన్కల్యాణ్ మద్దతు ప్రకటించినప్పుడే టీడీపీ విజయం ఖాయమైందన్నారు. చంద్రబాబునాయుడు రోజుకు 18 గంటలు కష్టపడతారని, ఆయన హాయంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, బుజ్జి, జి.వి.ఎస్.శర్మ, వెలగపూడి వెంకటేశ్వరరావు, బి.ఎస్.ఎస్. కోటేశ్వరరావు, రామకోటయ్య, ధూలిపాళ్ళ రమేష్, గద్దె రమేష్ తదితరులు ఉన్నారు.



వత్సవాయి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు జయప్రద ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ , ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, స్కూల్ యాజమాన్యం, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

# పంచశీల ఒప్పందం భేష్..

## నెహ్రూ విధానాలపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రశంసలు



వాస్తవాధీన రేఖ వెంబడి సరిహద్దు వివాదానికి సంబంధించి భారత్‌తో ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత విదేశాంగ విధానంలో ప్రధానమైన పంచశీల ఒప్పందాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న ఘర్షణలకు ముగింపు పలకడానికి ఆ ఐదు సూత్రాలు మెరుగ్గా పని చేస్తాయన్నారు.

భారత్ - చైనా మధ్య కుదిరిన ఒప్పందాన్ని పంచశీల ఒప్పందానికి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజింగ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిన్పింగ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఒప్పందం అనివార్యమైన చారిత్రక పరిణామం. శాంతి, అభివృద్ధికి ఈ ఐదు సూత్రాలు సమాధానమిచ్చాయి. చైనా-భారత్, చైనా- మయన్మార్ సంయుక్త ప్రకటనల్లోనూ ఈ సూత్రాలను మా గత నాయకత్వం చేర్చింది. దేశాల మధ్య బలమైన సంబంధాలకు వీటిని ప్రాథమిక నిబంధనలుగా చేర్చాలని సంయుక్తంగా పిలుపునిచ్చింది" అని జిన్పింగ్ గుర్తుచేశారు.

"మొదట ఈ పంచశీల ఒప్పందం ఆసియాలో పుట్టింది. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. 1960ల్లో మొదలైన అలీనోద్యమానికీ ఈ ఐదు సూత్రాలు మార్గదర్శకంగా నిలిచాయి. అంతర్జాతీయ సంబంధాలు, అంతర్జాతీయ చట్టాలకు ఈ సూత్రాలు ఓ ప్రమాణాన్ని నిర్దేశించాయి. వర్తమాన సంఘర్షణలను అంతం చేయడంలోనూ ఇవి ఉపయోగపడతాయి. ప్రపంచ భద్రత కోసం: మేం తీసుకొస్తున్న గ్లోబల్ సెక్యూరిటీ ఇనిషియేటివ్‌లోనూ ఈ విధానాలను అనుసరించాలను కుంటున్నాం" అని చైనా అధినేత వెల్లడించారు.

### ఏంటి పంచశీల ఒప్పందం..

పొరుగు దేశాలకు సంబంధించి ఒకరి అంతరంగిక వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదనే ఉద్దేశంతో భారత్ - చైనా మధ్య ఈ ఒప్పందం కుదిరింది. 1954లో ఇరు దేశాల అప్పటి ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, చౌ-ఎన్ లై దీనిపై సంతకాలు చేశారు. 1960లో నెహ్రూ ప్రారంభించిన అలీనోద్యమంతో ఈ విధానాలు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాయి.

### దీనిలోని అంశాలు:

- *సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతను పరస్పరం గౌరవించడం.*
- *ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం.*
- *దాడులు, ఆక్రమణలకు దిగకపోవడం, వివాదాలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవడం.*
- *అంతర్జాతీయ సంబంధాల్లో పరస్పర గౌరవం, సహకారం కోసం కృషి చేయడం.*
- *పొరుగు దేశాలతో శాంతియుత సహజీవనాన్ని ప్రోత్సహించడం*

# నా మీద నాకు నమ్మకం ఉంది కాబట్టే పోటీ చేస్తున్నా: బైడెన్



అమెరికా అధ్యక్ష ఎన్నికలకు కొన్ని నెలల సమయమే ఉండగా.. అధ్యక్షుడు జోబైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన సంవాదం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ చర్చ సమయంలో బైడెన్ పలుమార్లు తడబాటుకు గురైన తీరు స్వపక్షం డెమోక్రాటిక్ పార్టీలో ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో తన వయసును ఉద్దేశించి బైడెన్ స్పందించారు. "అవును నేను యువకుడిని కాదని నాకు తెలుసు. గతంలో మాదిరిగా చలాకీగా నడవలేను. అప్పటిలా స్పష్టంగా మాట్లాడలేను. మునుపటి మాదిరిగా చర్చించలేకపోవచ్చు. కానీ నాకు నిజం ఎలా చెప్పాలో తెలుసు. నా పనిని సక్రమంగా ఎలా చేయాలో తెలుసు. ఎవరైనా కిందపడిపోయినప్పుడు.. తిరిగి మళ్లీ పైకి లేస్తారు. అధ్యక్ష పదవిని నేను నిర్వర్తించగలనని మనస్ఫూర్తిగా నమ్మాను కాబట్టే మళ్లీ పోటీలో ఉన్నా" అని తన డిబేట్‌పై వస్తోన్న విమర్శలకు అధ్యక్షుడు ఇలా బదులిచ్చారు.

మరోవైపు మాజీ అధ్యక్షుడు, స్వపక్ష నేత బరాక్ ఒబామా ఆయనకు అండగా నిలిచారు. "చర్చలు సరిగా జరగని రోజులు ఉంటాయి. అయితే నన్ను నమ్మండి. సాధారణ ప్రజల కోసం జీవితమంతా పోరాడిన వ్యక్తికి (బైడెన్), తన గురించి మాత్రమే పట్టించుకునే వ్యక్తి (ట్రంప్‌ను ఉద్దేశిస్తూ)కి మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఒకరు నిజం చెప్పే వ్యక్తి- మరొకరు సొంత ప్రయోజనాల కోసం అబద్ధాలు చెప్పే వ్యక్తి.. ఈ ఇద్దరిలో ఒకరిని ఎంచుకోవడం కోసం జరుగుతున్న ఎన్నికలివి. ఒక్క డిబేట్ దానిని నిర్ణయించలేదు" అని మద్దతుగా నిలిచారు.

చర్చలో ట్రంప్ పైచేయి సాధించినట్లు సీఎన్ఎన్ పోల్‌లో మెజారిటీ వీక్షకులు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ సైతం బైడెన్ చర్చను నెమ్మదిగా ప్రారంభించినట్లు తెలిపారు. కానీ, చివరకు హుందాగా, దీటుగా ముగించారని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఎన్నికలకు ఇంకా నాలుగు నెలలకు పైగా సమయం ఉన్నందున బైడెన్‌ను కాకుండా వేరే అభ్యర్థిని బరిలో దించే -అవకాశాలపైనా డెమోక్రాట్లు చర్చించుకుంటున్నారు. అయితే తాను పోటీలో కొనసాగనున్నట్లు ట్రంప్ సంవాదం అనంతరం బైడెన్ స్పష్టం చేశారు.

# అంతరిక్ష కేంద్రాన్ని తొలగించేందుకు రూ.7వేల కోట్లు

## మస్క్‌కు నాసా కాంట్రాక్ట్



భూ ఉపరితలానికి కొన్ని వందల కిలోమీటర్ల ఎత్తులో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని త్వరలోనే తొలగించనున్నారు. ఈ దశాబ్దం చివరికల్లా ఐఎస్ఎస్‌ను కూల్చివేయనున్నారు. ఇందుకోసం అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ప్రణాళికలు ప్రారంభించింది. ఐఎస్ఎస్ను కూల్చేందుకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో 843 మిలియన్ డాలర్లతో (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 7000 కోట్లకు పైమాటే) ఒప్పందం కుదుర్చుకుంది.

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం.. మానవ నివాసయోగ్యమైన, మానవ నిర్మిత ఉపగ్రహం. దీని తొలిభాగాన్ని 1998లో ప్రారంభించారు. ఆ తర్వాత దశలవారీగా దీన్ని విస్తరించారు. భూమికి సగటున 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న దిగువ కక్ష్యలో పరిభ్రమిస్తుంది. ఇది భూమి చుట్టూ ఒకసారి తిరగడానికి 93 నిమిషాలు పడుతుంది. అంటే రోజుకు 15.5 సార్లు భూమిని చుట్టేస్తుంది. అమెరికా, రష్యా, జపాన్, ఐరోపా, కెనడా సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తుంటాయి. అనేక మంది శాస్త్రవేత్తలు భూమి నుంచి వెళ్లి కొన్ని నెలల పాటు ఇందులో పరిశోధనలు సాగిస్తుంటారు. దీని జీవితకాలం 2030 వరకు ఉంది. ఆ తర్వాత తొలగించనున్నారు.

### డీఆర్బిట్ వెహికల్‌తో..

దీనికి సంబంధించిన ప్రణాళికలను నాసా ప్రారంభించింది. "2030లో అంతరిక్ష కేంద్రం జీవితకాలం పూర్తయిన తర్వాత నాసా, అంతర్జాతీయ భాగస్వామ్య దేశాలు దాన్ని కక్ష్య నుంచి వేరు చేయనున్నాయి. ఆ తర్వాత దాన్ని సురక్షితంగా సముద్రంలో పడేస్తాం. ఇందుకోసం జనసాంద్రతలేని ప్రదేశాలను గుర్తిస్తున్నాం" అని నాసా ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ విచ్ఛిన్న ప్రక్రియలో భాగంగా తొలుత ఫుట్బాల్ మైదానం అంత పరిమాణంలో ఉండే ఈ రీసెర్చ్ ల్యాబ్‌ను 2030 మధ్యలో కొంచెం కొంచెంగా కిందకు తీసుకురానున్నారు. ఆ తర్వాత అందులోని కీలక సామగ్రితో వ్యోమగాములు భూమి మీదకు దిగుతారు. అనంతరం స్పేస్‌ఎక్స్ ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్న 'యూఎస్ డీఆర్బిట్ వెహికల్ దీన్ని భూవాతావరణంలోకి తీసుకొస్తుంది. అక్కడకు రాగానే అంతరిక్ష కేంద్రం కాలిపోతుంది. వాటి శకలాలను సముద్రంలో పడేలా చేస్తారు.

ఈ కేంద్రం 72 మీటర్ల పొడవు, 108 మీటర్ల వెడల్పు, 20 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఇందులో అయిదు పడక గదులున్నాయి. ఇప్పటివరకు 19 దేశాల వ్యోమగాములు. అంతరిక్ష పర్యటకులు దీన్ని సందర్శించారు. వీరిలో అత్యధికంగా అమెరికా నుంచి వెళ్లినవారే.

# అమెరికా మతస్వేచ్ఛ రిపోర్ట్‌పై భారత్ మండిపాటు..



భారతదేశంలో మతస్వేచ్ఛపై అమెరికావిడుదల చేసిన నివేదిక పక్షపాతపూరితంగా ఉన్నదని కేంద్రం ఆరోపించింది. అది కొన్ని సంఘటనలను మాత్రమే ఎంపిక చేసుకొని, ఓటుబ్యాంకు రాజకీయాల కోసం రూపొందించిన నివేదిక అని పేర్కొంది. భారతదేశ సామాజిక నిర్మాణంపై అవగాహన కూడా లేకుండా ఈ రిపోర్ట్ తయారు చేశారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. గత నివేదికలాగే ఇది కూడా పక్షపాతంగా ఉన్నదని అన్నారు.

ఈ రిపోర్ట్ మన రాజ్యాంగ నిబంధనలు, దేశ చట్టాల చెల్లుబాటును ప్రశ్నిస్తున్నట్టుగా ఉన్నదని పేర్కొన్నారు. భారతీయ కోర్టులు ఇచ్చిన కొన్ని చట్టపరమైన తీర్పుల సమగ్రతను కూడా ఇది సవాల్ చేస్తున్నదని అన్నారు. దేశంలో మైనార్టీలపై హింసాత్మక దాడులు పెరిగిపోయాయని బుధవారం విడుదలైన అమెరికా మతస్వేచ్ఛ రిపోర్ట్ వెల్లడించింది. 2023 మేలో మణిపూర్ లో ప్రారంభమైన హింసను ఇది ఉదహరించింది.

మణిపూర్ 253 చర్చిలు దగ్ధమయ్యాయని చురాచంద్పూర్ జిల్లాకు చెందిన కుకీ గ్రూప్ తెలిపిన విషయాన్ని ఈ నివేదిక ఉటంకించింది. వందలాది దేవాలయాలు ధ్వంసమయ్యాయని మైతీ కమ్యూనిటీ కూడా పేర్కొన్నట్లు వెల్లడించింది. దీనిపై స్పందించిన భారత్.. అమెరికాకు దీటైన సమాధానం ఇచ్చింది. 2023లో అమెరికా దేశంలోనే ద్వేషపూరిత నేరాలు, జాత్యహంకార దాడులు, భారత పౌరులు, ఇతర మైనార్టీలపైన దాడులు, ప్రార్థనా స్థలాల ధ్వంసం లాంటి ఘోరాలు జరిగాయని రణధీర్ జైస్వాల్ గుర్తుచేశారు. ఏదేమైనప్పటికీ భారతదేశంలోని ప్రజల రాజ్యాంగ హక్కుల గురించి మాట్లాడే హక్కు ఓ విదేశీ ప్రభుత్వానికి లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు.

# మరిన్ని నెలలు అంతరిక్ష కేంద్రంలోనే..

## సునీత- వ్యోమగాములు ఇద్దరూ సేఫ్!



బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మరిన్ని నెలలు ఉండనుంది. స్టార్?లైనర్?లో ఉన్న భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్ మోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మరిన్ని రోజులు పరీక్షలు చేయనున్నారు. నాసా ఇంజినీర్లు స్టార్?లైనర్?లో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. అయితే, అంతరిక్ష కేంద్రంలో పరీక్షలు పూర్తయ్యే వరకు భూమిపైకి తిరిగి వచ్చే తేదీని నిర్ణయించలేమని నాసా కమర్షియల్ ప్రోగ్రామ్ మేనేజర్ స్టీవ్ స్టిచ్ పేర్కొన్నారు. వ్యోమగాములు ఇద్దరూ సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. స్టార్?లైనర్? ?మిషన్ వ్యవధిని 45-90 రోజులకు పొడిగించాలనుకుంటున్నట్లు తెలిపారు. దీంతో త్వరలోనే భూమికి చేరుకుంటుందనుకున్న స్టార్‌లైనర్ వ్యోమనౌక, మరిన్ని నెలలు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండనుంది. కాగా, ఈ ఏడాది జూన్ 5న ఈ అంతరిక్ష యాత్రను చేపట్టారు.